కథ

యల్లాప్రగడ సువర్చలాదేవి

# ఆబ్దికం

ఈరోజు అప్పుడే ఐదో తారీఖు. రేపే ఆరు అంటే తనతో దాదాపు నలభై ఏళ్లు కాపురం చేసి తనని విడిచి వెళ్లిన తన జీవన సహచరి చనిపోయిన రోజు. తరతరాలుగా చనిపోయినవారికి ఆబ్దికం పెట్టకపోతే బ్రహ్మహత్యాపాతకం చుట్టుకొంటుందేమో అన్నంత భయంతో పెరిగిన వంశం తనది. తన సుపుత్రులు చూడబోతే అదేమి పట్టనట్టుగా ఉన్నారు. తనుండగానే తన భార్యకి జరుగుతోన్న ఈ 'గౌరవాన్ని' చూస్తూ తట్టుకోలేకుండా ఉన్నాడు శంకర్రావు. తనుండేది పెద్ద కొడుకు దగ్గర.

పెద్ద కోడలేమో 'ఇవన్నీ చేసే ఓపిక లేదు' అని అసలు ఈ కార్యక్రమానికే దూరంగా ఉంది. అది నిజమో, నటనో ఆ దేవుడికే తెలియాలి. చిన్నాడు కానీ, చిన్న కోడలు గానీ ఈ ఛాయలకు రావట్లేదు. బ్రతికున్న తననే ఏనాడు ఓ ఫోన్ చేసి పలకరించే సంస్కారం లేనివాడు చిన్నాడు. ఇక చనిపోయిన తల్లిని ఏం పట్టించుకొంటాడు.

కూతుళ్ళు ఊళ్ళోనే ఉన్నా ఎవరి పనుల్లో వాళ్ళు బిజీ అని మాట్లాడతారు. కనీసం సంవత్సరానికి ఒక్క రోజన్నా తల్లిని గుర్తుకు చేసుకోలేని ఈ పిల్లలెందుకు? వారిని కనలేనివారు బాధపడటమెందుకు? వారిని కని, పెంచి, పెద్ద చేసి వారి సమస్యలే తమ సమస్యలుగా చేసుకొని జీవితమంతా వారికి అంకితం చేయడం ఎందుకు? ఇక ఏమైనా అడగడానికి అందుబాటులో ఉన్నాడు పెద్దాడొక్కడే. కానీ అనవసరంగా వాడిని అడిగి తన పెద్దరికానికి తలవంపులు తెచ్చుకోవడమెందుకు? 'కనీసం తన కట్టె కాలిపోయేవరకూ తనకు మిగిలిన ఈ కాస్త చోటుకీ చేటెందుకు?' అని లోలోపలే కుమిలిపోసాగాడు శంకర్రావు. ఆరోజు యధావిధిగానే వృద్ధ మిత్రులంతా ఇందిరాపార్కులో కలిశారు. ఈ వయసులో వారికి ఆనందాన్ని ఇచ్చే సమయమేదైనా ఉంది అంటే అది సాయంత్రం వారంతా కలిపి గడిపే ఆ రెండు గంటలే. అందరివి ఏవో ఒక బాధలే కానీ ఆ రెండు గంటలు మాత్రం ఆ సీనియర్ సిటిజనులంతా చిన్న పిల్లలయిపోతారు. ఎంత దాద్దాం అన్నా శంకర్రావు మొహంలో విషాద ఛాయలను మిత్రులు పసిగట్టకుండా దాచలేకపోయాడు. చివరికి విషయం చెప్పక తప్పింది కాదు. "ఓస్ ఇదేమంత విషయం కాదు శంకర్రావ్.. మీవాడు కనీసం ఏ మఠంలోనైనా పెడతాడంటున్నావ్.. నిన్ను ఎలాగూ తన దగ్గరే ఉంచుకున్నాడు.. ఈ రోజుల్లో ఇంతకన్నా ఇంకా ఏమి ఆశిస్తాం.." తేలిగ్గా అన్నాడు శంకర్రావు చిన్ననాటి స్నేహితుడు వత్సలం.

"నిజమే శంకర్రావుగారు.. బ్రతికున్న తల్లిదండ్రులనే చూడని ఈ రోజుల్లో భారీ ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు జరపాలంటే వారి ఆర్థిక స్థోమత, సమయమూ, పనులు చేసేవారు.. ఇవన్నీ చూడాలి కదా..." సర్ది చెప్పబోయాడు ఈ మధ్యనే ఈ బ్యాచిలో చేరిన రిటైర్డ్ ప్రొఫెసర్ షణ్ముగం గారు.

"అవును శంకర్రావుగారు మన పల్లెటూళ్లలో లాగా కాదు గదా ఈ సిటీలలో ఆబ్దికం పెట్టించేవారు ఎక్కడ దొరుకుతారు, చెయ్యవలసిన అనుపాకాలు చేయడం మనవాళ్ల వల్ల ఏమవుతుంది... వాటికోసం వంట మనుషులను వెతకాలి.. ఈ సిటీలలో పని మనుషులు, వంట మనుషులు అంటే ఎంత కష్టమో తెలియంది కాదు.." గుర్నాథం తన అభిప్రాయాన్ని వినిపించాడు అనడం కన్నా శంకర్రావు బాధను తగ్గించాలని చూశాడనడం సబబుగా ఉంటుందేమో!

కానీ ఆ మాటలు శంకర్రావుని ఒక్కసారిగా కొన్ని సంవత్సరాలు వెనక్కి తీసుకువెళ్లాయి. మనవడి ఉపనయనానికి, మనవరాలి ఫంక్షన్‌కి కోడలు డబ్బుని మంచినీళ్లలా ఎలా ఖర్చు చేసిందో ఎంత అంగరంగ వైభవంగా చేసిందో గుర్తొచ్చింది. అవేగాక తన తల్లిదండ్రుల షష్టిపూర్తికి మాత్రం ఏం తక్కువ చేసిందని?! కాని ఇప్పుడు చేయాల్సింది అత్తగారిది కనుక కావాలనే ఇలా ప్రవర్తిస్తోందని ఆయనకి అర్థమవుతూనే ఉంది. అర్థం కానిదల్లా తన కొడుక్కే ఇవన్నీ ఎందుకు కనబడటం లేదన్న సంగతే.

"మీవాడు ఇంకా నయం ఏ మఠంలోనైనా కానిచ్చేస్తున్నాడు. మా అన్నయ్యగారబ్బాయైతే ఆ ఊసే ఎత్తడం లేదు. పైగా ఇవన్నీ మూఢ నమ్మకాలంటాడు" తన అనుభవాన్ని పంచుకున్నాడు భాస్కరం.

ఈ కాలం పిల్లలకి వాళ్ళు ఎంత పాపం చేస్తున్నారో వాళ్లకి అర్థం కావడం లేదు. సంవత్సరానికొక్కసారి పెద్దలను తలచుకొని నలుగురికి భోజనాలు పెట్టి ఏ పేదవారికో కాస్త దానం చేయలేని స్థితులలో మనుషులు ఉండటం లేదు కదా... ఎన్ని లక్షలు సంపాదిస్తున్నా ఇలాంటి మంచి లక్షణాలు లేనప్పుడు ఏమి లాభం" కాస్త ఘాటుగానే అన్నాడు నరసింహశాస్త్రి. అనయ మాట తీరే కరుకు. ఆయన సొంత వూళ్లోనే ఉంటారు కానీ అప్పుడప్పుడు హైద్రాబాదు వచ్చి పిల్లలను చూసి వెళుతుంటారు.

"పోనీలెండి శాస్త్రిగారు మనం వారిని దీవించకపోయినా, శపించకూడదు" సర్ది చెప్పబోయాడు షణ్ముగం..

"ఎంత చేసినా వారిని ఓ మాట అననీయని మన పెద్దరికమే వారిని ఇలా తయారుచేస్తోంది" శాస్త్రిగారి మాటకి ఎవరూ ఎదురు చెప్పలేకపోయారు.

ఆబ్దికం రోజు రానే వచ్చింది. ఇంట్లో ఏమి సందడి కనిపించడం లేదు. కొడుకు తయారయ్యి ఆఫీస్‌కి వెళుతుంటే ఇక ఉండబట్టలేక విషయాన్ని కదిపాడు శంకర్రావు. ఆఫీస్‌కి వెళుతూ మఠంలో పెట్టేసి వెళతాను అన్నాడు కొడుకు.

తమ్ముడు, చెల్లెళ్లు ఎవరూ రావడం లేదా అంటే "ఆ.. ఎవరికి కుదురుతుందిలే.." అని మరో ప్రశ్నకి అవకాశం ఇవ్వకుండా గబ గబా వెళ్ళిపోయాడు. కనీసం భార్య ఫోటోని గుడ్డ పెట్టి తుడిచిన వాళ్ళు కూడా లేనందుకు అప్రయత్నంగా శంకర్రావు కళ్ళవెంట నీళ్లు ఉబికాయి. ఆ రోజు మనవడు, మనవరాలు కూడా తమ పనుల్లో తాము వెళ్ళిపోయారు.


దాదాపు పదకొండు అవుతుండగా కోడలు కూడా ఏదో పార్టీ ఉందని వెళుతూ తన భోజనం కానిచ్చేసింది. "మీరు తింటానంటే భోజనం పెట్టేస్తాను" అంది. అది తన మీద గౌరవం కాదు వంటిల్లుని తనమీద వదిలి వెళ్లడం ఇష్టంలేదని అతనికి తెలుసు. 'ఈరోజు ఎలాగా!?' అని ముందురోజు రాత్రిగానీ, ఆరోజు ఉదయం కానీ ఆయన ఏమీ తినకపోవడంతో ఆకలి కూడా వేస్తోంది. ఏమి చేశారో అని చూశాడు. వంట మనిషే వడ్డించింది. దొండకాయ కూర, చింతకాయ పచ్చడి, నీళ్ళలాంటి మజ్జిగ. బాధతో ఒక్కసారి నోరు పూడుకుపోయింది శంకర్రావుకి. "నువ్వుపొడి కానీ, పెసరపప్పు కానీ చేయాలమ్మా ఈరోజు" అంటే "పిల్లలకి అలాంటివి ఇష్టం ఉండవు. అందుకే చేయించలేదు" అని చెప్పింది కోడలు.

"గారె కానీ, పరమాన్నం కాని చేయలేదా" అని అడిగితే "లేదు" అని ఖరాఖండిగా చెప్పాక ఇక ఏమీ అడగాలనిపించలేదు ఆ పెద్దాయనకు.

బ్రతికున్న తండ్రినే 'ఇంత బాగా చూస్తుంటే', చనిపోయిన తల్లి పేరున ఏ దాన ధర్మాలు చేస్తాడు అని ఆరోజు రాత్రి కొడుకుని ఈ విషయాల గురించి గానీ, కనీసం ఆబ్దికం మఠంలోనైనా పెట్టించావా అని గానీ అడగలేకపోయాడు ఎలాంటి సమాధానం విని బాధపడాల్సి వస్తుందో అని.

కొన్ని నెలల తర్వాత ఓరోజు సాయంత్రం ఇందిరా పార్కులో మిత్రులంతా కలిశారు. కాసేపటికి మిత్రులందరినీ ఉద్దేశించి నరసింహ శాస్త్రిగారు అన్నారు. "ఈనెల పదో తారీఖున మా వూళ్లో మా నాన్నగారి ఆబ్దికం చేస్తున్నాను. దీనికోసం పిలవకూడదు కానీ మీరంతా కూడా వస్తే మీకూ కాస్త మార్పుగా ఉంటుంది. పైగా గోదావరి ఒడ్డున ఉండే మా ఊరు అందాలను చూడటానికి రెండు కళ్ళు చాలవు. మీతో పాటు మీ కుటుంబ సభ్యులను తీసుకువచ్చినా వసతికేమి ఇబ్బంది ఉండదు. మీ ఇంట్లో మాట్లాడి చూడండి"

కొందరు ఉత్సాహం చూపించారు. కొందరు ఉత్సాహం ఉన్నా ఆరోగ్య దృష్ట్యా ప్రయాణాలు చేయలే



మన్నారు. కొందరేమో మా ఇంట్లో వాళ్ల సంగతి తెలియదుగానీ మేము వస్తాం అన్నారు. శంకర్రావు లాంటివాళ్ళు మాత్రం చెప్పి చూస్తామన్నారు.

ఆరోజు ఇంట్లో విషయం చెప్పాక మనవళ్ళు, మనవరాళ్లు ఉత్సాహం చూపించారు. "చాలా రోజులైంది కదా డాడీ! సరదాగా వెళ్ళొద్దాం" అన్నారు. కోడలేమో "ఆ పల్లెటూళ్లో ఏముందని వెళతాం, దానికన్నా ఏ ఊటీకో, కొడైకెనాల్‌కో వెళ్లినా అందం" అంది. కొడుకేమో డోలాయమానంగా ఊగాడు. చివరికి తనకూ ఉద్యోగం నుండి కాస్త రిలీఫ్ దొరుకుతుందని పిల్లలవైపే మొగ్గాడు. తనకి అక్కడ ఏమాత్రం నచ్చకపోయినా వెంటనే తిరిగి వచ్చేయాలి అనే షరతుపై కోడలు ఒప్పుకుంది.

శంకర్రావుకి చాలాకాలం తర్వాత ప్రయాణం కావడం అది తన ఇష్టానికి చాలాకాలం తర్వాత ఆ ఇంట్లో ప్రాముఖ్యం లభించడంతో ఆశ్చర్యానందాలతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు.

శంకర్రావులానే కొందరు కుటుంబాలతో, కొందరు ఒంటరిగా ప్రయాణమయ్యారు. అందరికి చక్కని వసతి ఏర్పాటుచేశారు శాస్త్రిగారు. వసతికి ఇచ్చినవి అన్నీ ఇళ్లే అయినా చక్కని కాటేజీలలాగ అందమైన పూల మొక్కల మధ్య, ప్రశాంతమైన వాతావరణంలో ఉన్నాయి. ఓ పక్క గలగల పారే గోదారి, మరో పక్క ఆహ్లాదకరమైన పల్లె వాతావరణం. తద్దినం రోజున శాస్త్రిగారు పనులతో బిజీగా ఉన్నారు. శంకర్రావు మరి కొందరు మిత్రులు అక్కడే కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుతూ ఆనందంగా ఉన్నారు. శంకర్రావు కొడుకు ఆనంద్ కూడా అక్కడే కూర్చొని తతంగమంతా గమనిస్తున్నాడు. పిల్లలేమో సైట్ సీయింగ్ అని వెళ్లారు. కొందరు ఆడవారంతా ఒక దగ్గర చేరారు. శంకర్రావు కోడలికి అక్కడ ఆడవారితో చేరక తప్పింది కాదు. శాస్త్రిగారి భార్య, తనతో పాటు మరో వంటమనిషి మడిగట్టుకొని వంటలు చేస్తున్నారు. శాస్త్రిగారి బంధువులు చాలామందే వచ్చారు. ఆయన సంతానం, మనవళ్ళు, మనవరాళ్లు, ముని మనవళ్ళు కూడా ఉన్నారంట. దాదాపు ఎనభై ఏళ్ళు ఉండే శాస్త్రిగారి అత్తయ్య కూడా అన్నయ్య ఆబ్దికం అని వైజాగ్ నుండి వచ్చారు.

ఆ తరంలో బ్రతికున్నది ప్రస్తుతం ఆమె మాత్రమే. అక్కడున్న శాస్త్రిగారి బంధువులంతా ఆప్యాయంగా ఆమెని పలకరించి ఆమె ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. శాస్త్రిగారి తమ్ముళ్ళు, అక్క చెల్లెళ్లు కూడా ఎక్కడెక్కడ నుంచో వచ్చారు. శాస్త్రిగారి మేనల్లుడు అమెరికాలో ఉండి రాలేకపోవడంతో ఫోన్ చేసి పలకరించాడుట. నిజంగా శాస్త్రిగారి తండ్రి అదృష్టవంతుడు అనుకున్నారంతా. శంకర్రావుగారు, అతని ఇతర మిత్రబృందం "ఈ రోజుల్లో కూడా మనుషులు ఇలా కూడా ఉంటారా!" అని అబ్బురపడ్డారు.

అన్ని కార్యక్రమాలను పురోహితులు శాస్త్రోక్తకంగా చేశారు. పురోహితులు అరటి ఆకులలోనే తింటారుట. ఎవరో చెప్పారు. శాస్త్రిగారి అబ్బాయితో కలసి సరదాగా శంకర్రావుగారి అబ్బాయి ఆనంద్ కూడా వెళ్లాడు. తమ పరిచయస్తుల ఇంటికి వెళ్లాడు శాస్త్రిగారి అబ్బాయి. అక్కడ వారు చాకు ఇచ్చి కావల్సినన్ని ఆకులు కోసుకోమని చెప్పారు. ఆనంద్‌కి సిటీలలో పక్క అపార్ట్‌మెంట్ వాడి మొహం కూడా తెలియని ఇరుగు పొరుగుకి, ఇక్కడి ఇరుగు పొరుగుకి ఎంత తేడా అనుకొన్నాడు. అలాగే తాజా తమలపాకులు, వక్క, సున్నం, ఇలా అన్నీ తీసుకున్నారు. అలా స్వచ్ఛమైన ఆ వాతావరణంలో కల్మషం లేని ఆ పల్లె జనాల మధ్య తిరిగిన ఆనంద్ తను ఉంటున్నది ఎలాంటి వాతవరణంలో అని ఎన్నోసార్లు అనుకున్నాడు అప్పటికే.

ఆ ఊళ్ళోని తాజా పూలతో పెద్ద దండ కట్టి తీసుకొచ్చారు కొందరు శాస్త్రిగారి ఆప్తులు. కొందరు అప్పటికే శాస్త్రిగారి తండ్రిగారి ఫోటోని శుభ్రంగా తుడిచి ఉంచారు. బంతిపూలు, గులాబీ పూలతో కట్టిన తాజా పూలదండని వేయగానే ఆ ఫోటోకి, ఆ గదికీ కూడా మంచి కళ వచ్చిందనుకొన్నారంతా. వచ్చినవారంతా ఆ ఫోటోకి నమస్కరించకుండా వెళ్ళకపోవడం ఆనంద్ దృష్టిని దాటిపోలేదు.

భోజనాల వేళ అయ్యింది. పురోహితులకి విడిగా

వడ్డించారు ఓ గదిలో. కాసేపటికి మగవాళ్లకు ఓ బంతి వడ్డించారు. కిందే వరుసగా కూర్చొన్నారంతా. ముందు కాస్త ఇబ్బంది అనిపించినా ఆనంద్‌కి తరువాత ఇదే బాగున్నట్టు అనిపించింది. అందరికి విస్తరాకుల్లో భోజనం. అరటి, కంద, బెండ కాయలతో మూడు కూరలు, పెసరపప్పు, నువ్వు పొడి, కాచిన కమ్మని నెయ్యి, నిమ్మకాయ కారం, అల్లం పచ్చడి, ఆవ పచ్చడితో మూడు పచ్చళ్లు, ఇవిగాక రెండు రకాల గారెలు, అరిశెలు, బెల్లం పరమాన్నం, ముక్కల పులుసు, పెరుగుతో కమ్మని భోజనం. అందరూ వంట వండినవాళ్లని మెచ్చుకుంటూ తిన్నారు. పై లోకంలో ఉన్న శాస్త్రిగారి తండ్రి ఎంతో సంతోషిస్తారని ఈసారి ఎంతోమంది ఆయన పేరు చెప్పుకొని తృప్తిగా తిన్నామని చెప్పుకున్నారు. తాతగారి ప్రసాదం అని చిన్నపిల్లలు ఉత్సాహంగా తినడం, పసి పిల్లలకి సైతం ముత్తాతగారి ప్రసాదం అని చెప్పి తియ్యని పరమాన్నాన్ని గోరు ముద్దలుగా తినిపిస్తుంటే అందరితోపాటు శాస్త్రిగారి కళ్ళు తృప్తిగా చెమర్చినాయి. మగవాళ్ల బంతి పూర్తయ్యింది. మరో గంటలో ఆడవాళ్ల బంతి కూడా పూర్తయ్యింది. పిల్లలు వారికిష్టమైన బంతులలో కూర్చున్నారు.

భోజనాల కార్యక్రమం తరువాత అంతా ఎక్కడివారక్కడ చేరి పిచ్చాపాటి మాట్లాడుకొన్నారు. కాసేపటికే శంకర్రావు కోడలు కూడా వారితో కలిసిపోయి ముచ్చట్లలో పడిపోవడం చూసిన శంకర్రావుకి, ఆనంద్‌కి అంతా ఈ ఊరు మహిమ అనిపించింది.

కాసేపటి తరువాత పనివాళ్లకి, ఆ చుట్టుపక్కల పేదవాళ్లకి అన్నసంతర్పణలు అయ్యాయి. ఆ తరువాత పేదవారికి తన తండ్రి పేరున పంచెలను, ఆడవారికి చీరెలను పెట్టారు శాస్త్రిగారు.


"చాలా ఘనంగానే చేసినట్టున్నారు" అన్నారు షణ్ముగం గారు.

"వాళ్ళు మనకి చేసినదానితో పోల్చి చూస్తే ఇదేం పెద్ద విషయమని" తేలిగ్గా అన్నారు శాస్త్రిగారు.

ఆనంద్‌కి చెళ్ళున కొరడాతో కొట్టినట్టు అనిపించింది. తనకి ప్రతిక్షణం తమ జీవన విధానానికి, ఇక్కడి జీవన విధానానికి మధ్య పోలిక తెస్తుంటే తాము నిజంగా అభివృద్ధి చెందామా లేక అభివృద్ధి పేరుతో మరింత దిగజారామా అన్న శంక పదే పదే తొలుస్తూనే ఉంది. శాస్త్రిగారికే దాదాపు అరవై ఐదేళ్లు ఉంచాయి. ఆయన ఈ వయసులోనూ చనిపోయిన తన తల్లిదండ్రులకు ఇస్తున్న గౌరవం ఎలాంటిది, తను బ్రతికున్న తన తండ్రికి, చనిపోయిన తన తల్లికి ఇస్తున్న గౌరవం ఏపాటిది.. పోల్చి చూసుకొనేకొద్దీ తనకే చిన్నతంగాను, తనమీద తనకే అసహ్యంగా ఉంది. తను ఎన్ని లక్షలు సంపాదిస్తున్నాడు కాని ఏం లాభం. శాస్త్రిగారితో పోల్చి చూసుకోవడానికి కూడా తను అనర్హుడిగా కనపడసాగాడు.

## సొంత నిర్మాణం

ఓ వైపు నటనతో బిజీగా వుంటూ రెండు చేతులా సంపాదిస్తున్నప్పటికీ నిర్మాతగా కూడా మారి తన అభిరుచికి తగిన సినిమాలను నిర్మించాలని ఐశ్వర్యారాయ్ భావిస్తోందిట. 'ఐశ్వర్య ప్రొడక్షన్స్' అనే బ్యానర్ మీద చిత్రనిర్మాణం చేయాలని ఐశ్వర్య ఆలోచిస్తున్నట్టు, దీనికి ఆమె అత్తామామలు, భర్త నుంచి కూడా ప్రోత్సాహం వున్నట్టు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఐశ్వర్యారాయ్ లాంటి తార సినిమా తీస్తోందంటే ఆ సినిమాకి వచ్చే క్రేజ్ గురించి చెప్పేదేముంటుంది చెప్పండి?



శాస్త్రిగారి భార్యకి దాదాపు అరవై ఏళ్ళు ఉంటాయి. ఈ వయసులోనూ ఆమె చనిపోయిన తన మామగారి కోసం మడి కట్టుకొని మరీ వంట చేసిందే. అదే తన భార్య.. సిటీలో తనకీ, తన భర్తా పిల్లలు, ఓ మామయ్యకి రోజువారి ఓ కూరా, పప్పు చేయడానికి కూడా ఓ వంటమనిషిని పెట్టుకొన్నా అత్తగారి ఆబ్దికాన్ని ఇంట్లో జరిపించలేకపోయింది. కేవలం తప్పు భార్యదేనా? తనేం చేస్తున్నాడు. తన బుద్ధి ఏమైయ్యింది. తనకి తానే చాలా చిన్నవాడిగా కనబడుతున్నాడు. ఇదంతా చూస్తున్న తనకే ఇలా అనిపిస్తుంటే, మరి తన తండ్రికి ఇంకెంత బాధ ఉండొచ్చు. సూటిగా తన తండ్రి కళ్లలోకి కళ్ళు పెట్టి చూడలేకపోయాడు. ఏదో తప్పు చేసిన ఫీలింగ్ తనని వెన్నాడుతోంది.

ఆనంద్ మనసులోని భావాలు అక్కడి పెద్దవారికి అర్థమవుతున్నా ఏమి చేయలేక మౌనంగానే ఉన్నారు అక్కడివారంతా. ఆ మరునాడు తిరుగు ప్రయాణంలో శంకర్రావు చిన్ననాటి స్నేహితుడు వత్సలం ఆనంద్‌తో మాట కలిపాడు. ఆయనతో కూడా ఫ్రీగా మాట్లాడలేకపోయాడు ఆనంద్. "చూడు ఆనంద్ నీ మనసులో భావాలను నేను అర్థం చేసుకోగలను. నువ్వు మరీ ఇంతలా అయిపోనవసరంలేదు. నీలో వచ్చిన ఈ మార్పే చాలయ్యా. ఈ రోజుల్లో ఏ తల్లిదండ్రులు తమ పిల్లల నుండీ పెద్దగా ఏమీ కోరుకోరయ్యా, కాస్త అభిమానం, గౌరవంలాంటివి తప్ప. మీరు చనిపోయినవారికి సంవత్సరానికి ఒక్కసారి చేసే ఈ కార్యక్రమం మీరు వారికిచ్చే పెద్ద గౌరవం. దీని వల్ల మీరు పొందే మానసిక ఆనందం వెల కట్టలేనిది. ఈ తరానికి ఈ విషయాలన్ని తెలియక పోవడమే బాధపడాల్సిన విషయం. దీనికి మిమ్మల్నే మేము బాధ్యుల్ని చేయడం లేదు. మాలోనూ కొంత తప్పుంది. మా పెద్దలకి మేము ఇచ్చే గౌరవమే మీరు మాకు ఇవ్వడానికి ఓ స్ఫూర్తి లాంటిది. ఈ ఆచార సాంప్రదాయాలే మన ఆస్తులు. ఇవే మనల్ని ఇంకా మనుషులుగా నిలుపుతున్నాయి. ఏదో ఆవేశంలో మాట్లాడేశాను. నువ్వేమి తప్పుగా అనుకోకు బాబూ..." అన్నాడు చెమర్చిన కళ్లని తుడుచుకుంటూ వత్సలం.

"లేదు బాబాయ్! మీరు చెప్పింది అక్షర సత్యం. ఇప్పుడు మనము కూడా ఈ సాంప్రదాయాలను పరిరక్షించకపోతే రాబోయే తరంలో మనిషికీ, మనిషికి మధ్య ఏ సంబంధాలు మిగలవు. మన పెద్దలు ఎన్నో ఆలోచించి మొదలుపెట్టిన ఇలాంటి సత్సాంప్రదాయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనందరిమీదా ఉంది. ఇకనుండీ నా వంతు కృషి నేనూ తప్పక చేస్తాను" అంటూ వత్సలం చేతులు పట్టుకున్నాడు ఆనంద్. ఇదంతా పక్కనుండి గమనిస్తున్న శంకర్రావు తన కొడుకుని మార్చిన భగవంతునికి, ఇలాంటి అవకాశం కల్పించిన శాస్త్రిగారికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు.

○